## తాళ్లపాక అన్నమాచార్య ఆధ్యాత్మ సంకీర్తన

రాగము: రామక్రియ
రేకు: 0390-03
సంపుటము: 4-522

||పల్లవి||

గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగీఁ జూడరో చింతామణి యీపె

||చ1||

పాల జలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీ నరసింహులక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీ లీల లోకములేలే యిందిర యీపె

||చ2||

ఘన సంపద లొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశముఁ బాయని మహా హరి ప్రియ యీపె
ధన ధాన్య రూపపు శ్రీ తరుణి యీపె

||చ3||

రచ్చల వెలసినట్టి రమా వనిత యీపె
మచ్చిక గలయలమేల్‌మంగ యీపె
యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలూఁ దావు కొనిన నిధాన మీపె